## క్లుప్తంగా

### చంద్రయాన్-3 విజయానికి ప్రత్యేక పూజలు



చెరుకుపల్లి: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావాలని గుళ్లపల్లి గ్రామంలోని శ్రీగంగాంబికా సమేత ఆనందీశ్వరస్వామి దేవాలయంలో నాన్నగారు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రయాన్ - 3 విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ప్రయాగ రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దొంతుబోయిన సీతారెడ్డి, కట్టా శివయ్య, చల్లా ఏసుబాబు, దుండి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపదల చేయనున్నట్లు ఆ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ పి.ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జగనన్న కాలనీలో విద్యుత్ మెయింటెనెన్స్ నిర్వహిస్తున్నందున అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వెల్లటూరులో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అవాంతరం ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఆర్థిక సాయం అందజేత..



కర్లపాలెం: ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందిచటం మానసిక సంతృప్తినిస్తుందని అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ తెలిపారు. కర్లపాలెం పంచాయతీ ఎంపీ రాజుపాలెం గ్రామానికి చెందిన దొంతిబోయిన లక్ష్మీతిరుపతమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, నడవలేని స్థితిలో మంచంలోనే ఉండటంతో అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైద్య ఖర్చుల కోసం ఫౌండేషన్ తరపున రూ.10వేలు, సొంతంగా మరో రూ.10వేలు ఇచ్చామని తెలిపారు. కల్లం హరనాథరెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు విన్నకోట సురేష్ అఖండ ఫౌండేషన్ స్థాపించి, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.శివ, సుబ్రహ్మణ్యం, చల్లా రాజు, శ్రీనివాసమూర్తి, ఆట్ల హరిబాబురెడ్డి, సుధాకర్‌రెడ్డి, అఖిల్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆరేపల్లిలో ఆధార్ అప్‌డేట్ శిబిరం..

చెరుకుపల్లి: ఆధార్‌కార్డుల్లోని తప్పులను పరిష్కరించుకునేందుకు ఆరేపల్లి సచివాలయంలో ఆధార్ కార్డు డాక్యుమెంట్ అప్‌డేట్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నపల్లి సచివాలయంలో ఈ నెల 22న, 23 తేదీల్లో, రాజవోలు, కావూరు, 24న, గూడవల్లి, కుంచాలవారిపాలెం, 25న చెరుకుపల్లి, కనగాల గ్రామాల సచివాలయాల వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కొత్తగా ఆధార్ కార్డు నమోదు, ఆధార్‌లో మార్పులు చేర్పులు, వేలి ముద్రలు పడనివారు అప్డేట్ కోసం, చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డు జారీ, ఐదు సంవత్సరాలు పైబడిన పిల్లల ఆధార్ అప్డేట్, 15 సంవత్సరాలు నిండిన పిల్లల చేతి వేళ్ల అప్డేట్ వంటి అన్నిరకాల ఆధార్ సేవలకు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు ఈ ప్రత్యేక ఆధార్ క్యాంప్ గురించి ఆయా గ్రామ ప్రజలకు తెలియజేయాలన్నారు.

### రేపటి నుంచి నగరపాలక సంస్థలో ఈఎస్ఐ క్యాంపు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ శిబిరాన్ని ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా కార్డుల్ని అప్డేట్ చేసుకోవాలని ఆమె సూచించారు.

### ఇంట్లో చోరీ..

గుంటూరు ఈస్ట్: ఇంట్లో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. యతిరాజుల కాలనీ ఐదో లైనులో నివాసం ఉండే మేడసాని అంజమ్మ కుటుంబ సభ్యులతో కలసి ఈనెల 19న ఊరెళ్లి, తిరిగి 20న ఇంటికి చేరుకుంది. తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించగా, బీరువాలోని రూ. లక్ష నగదు, రెండు బంగారం దిద్దులతో పాటు పలు గృహో పకరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున**



వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

మోదుకూరు(వేమూరు): సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వేమూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం ఆయన నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. గ్రామంలోని ప్రజలు అంగలకుదురు నుంచి మోదుకూరు రోడ్డు గురించి మంత్రిని అడిగారు. రోడ్డు పనులు చేపట్టడం జరిగిందని ఆయన వారికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అంగలకుదురు నుంచి మోదుకూరు వరకు రోడ్డు వేస్తామని చెప్పి, ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంగలకుదురు నుంచి మోదుకూరు రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. అనేక గ్రామాల్లో రోడ్ల నిర్మాణాల పనులు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి శాలి, వైస్ ఎంపీపీ జాలాది రూబేను, ఎంపీపీ అళ్ల వెంకటరమణారెడ్డి, అన్నపరెడ్డి వీరారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు అన్నపరెడ్డి రఘురామిరెడ్డి, ఎంపీటీసీ కొల్లి బాలసరస్వతి, సొసైటీ అధ్యక్షుడు గోగిరెడ్డి శేషారెడ్డి, గ్రామ సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, సునీత సురేష్, మాజీ సర్పంచ్ పినమనేని శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

## సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య
- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది
- రహదారుల అభివృద్ధికి రూ.27 కోట్లు మంజూరు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.300 కోట్లు అందించాం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

నగరం: రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ శ్రీకృష్ణయ్య సమావేశానికి అధ్యక్షత వహించి, మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి సమస్యలు లేకుండా ఇరిగేషన్ అధికారులు కృషి చే యాలని కోరారు. గ్రామాలలో అంతర్గత రహదారులు అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాంపట్నం పర్యటనలో భాగంగా.. నగరం మండలంలో రహదారుల అభివృద్ధికి రూ.27కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు సంక్షేమ పథకాలకు రూ.300 కోట్లను అర్హులైన లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.30 కోట్ల పనులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నట్లు వెల్లడించారు. తొలుత మండల సర్వసభ్య సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడిని శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగయ్య, కృష్ణమోహన్, సుభాషిణి

బాపట్ల అర్బన్: వెల్లటూరు గ్రామంలో ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని వెంటనే శిక్షించాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సి.హెచ్.గంగయ్య డిమాండ్ చేశారు. బాపట్లలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం పాఠశాలకు వెళ్లిన చిన్నారిపై స్కూలు పక్కనే ఉన్న కాలనీకి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు టి.కృష్ణమోహన్, ఐద్వా నాయకురాలు టి.సుభాషిణి పాల్గొన్నారు.

**అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి**

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన భట్టిప్రోలులో మాట్లాడుతూ చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడికి శిక్ష పడే వరకు బెయిల్ ఇవ్వకుండా, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా సత్వరం విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## 26న 'పంచుకుందాం రా' పుస్తకంపై చర్చా వేదిక

తెనాలి: 'ఆహ్వానం లక్ష్మి' సంస్మరణలో భాగంగా ఈనెల 26న కవి, సామాజిక ఉద్యమాల కార్యకర్త కృపాకర్ మాదిగ కవిత్వం 'పంచుకుందాం రా' పుస్తకంపై చర్చా వేదిక జరగనుంది. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆరోజు సాయంత్రం 6 గంటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయే సభకు కె.వి. రాఘవరెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. దళిత ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా వైస్ చాన్సలర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ప్రారంభించే చర్చలో ప్రముఖ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య, ఆచార్య పొన్నెకంటి రత్నాకర్, రచయిత్రి గంగవరపు సునీత, కవి కృపాకర్ మాదిగ పాల్గొంటారు. గత ఏప్రిల్ 17న మృతి చెందిన 'ఆహ్వానం లక్ష్మి'కి నివాళిగా ఏడాదిపాటు ప్రతినెలా ఒక మంచి పుస్తకంపై చర్చను జరపాలని భిన్నస్వరాలు తీర్మానించుకుంది. ఆ ప్రకారం నెలనెలా చర్చా వేదికను నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే.

## ట్రాఫిక్ ఎస్ఐగా శివరామయ్య బాధ్యతల స్వీకరణ



తెనాలి రూరల్: తెనాలి ట్రాఫిక్ ఎస్ఐగా బి. శివరామయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా పని చేస్తున్న ఆయన వ్యక్తిగత కారణాలతో కొద్దికాలంగా సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన్ను ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాస్ త్వరలో సీఐగా ఉద్యోగోన్నతి పొందనున్నారు. అప్పటి వరకు ఇద్దరు ట్రాఫిక్ విభాగంలో ఎస్ఐలుగా పని చేస్తారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను శివరామయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

## రామకృష్ణ విద్యానిలయానికి ఎమ్మెల్యే అనగాని వితరణ



ఎమ్మెల్యే సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న స్కూల్ కమిటీ సభ్యులు

రేపల్లె రూరల్: పట్టణంలోని రైలుపేట శ్రీ రామకృష్ణ విద్యా నిలయానికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆర్థిక చేయూతనందించారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.1.50లక్షలు అందజేసి, పాఠశాలలో మౌళిక సదుపాయాలు సమకూర్చాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే సత్యప్రసాద్‌ను పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, కమిటీ సభ్యులు అన్నవరపు శ్రీనివాసరావు, మద్ది పద్మజ, రవిబాబు, తటవర్తి రాధికారాణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె రూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఇసుకపల్లి విద్యుత్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, విద్యుత్ ఉద్యోగులని క్రమబద్ధీకరించటంతో పాటు సీపీస్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్, నాయకులు రాజరమేష్, అంబేడ్కర్, శంకర్, సీఐటీయూ నాయకులు కె.రమేష్, కె.ఆశీర్వాదం పాల్గొన్నారు.

## ఎత్తిపోతల పథకం పనుల్ని వెంటనే ప్రారంభించాలి

- సబ్ కలెక్టర్‌కు ఛానల్ సాధన పోరాట కమిటీ వినతి
- కుల ధ్రువీకరణ కోసం మాస్టిన్ కులస్తుల అర్జీ
- 'స్పందన'లో అయిదు అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: మంగళగిరి, తెనాలి నియోజకవర్గాల పరిధిలో గల పెదవడ్లపూడి హైలెవెల్ చానల్ ఎత్తిపోతల పథకం నిర్మాణ పనుల్ని వెంటనే ప్రారంభించాలని కోరుతూ చానల్ సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందజేశారు. స్పందన సమావేశంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పెదవడ్లపూడి హైలెవెల్ చానల్‌పై కమిటీ కన్వీనర్ ములకా శివసాంబిరెడ్డి, జెట్టి బాలరాజు, కావూరి వాసుదేవరావు, మైలా వెంకట రామరాజు అర్జీని అందజేసి, సమస్యను వివరించారు. ఐదు మండలాల్లోని 26 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఎత్తిపోతల పథకం నిర్మాణ పనుల్ని రూ.9 కోట్లతో 2017లో ప్రారంభించినట్టు గుర్తు చేశారు. 70 శాతం పనులు పూర్తయినా, సంబంధిత కాంట్రాక్టరుకు ఆరేళ్లుగా బిల్లులు చెల్లించని కారణంగా పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. దుగ్గిరాల మండల గ్రామం తుమ్మపూడిలో నివసిస్తున్న 'మాస్టిన్' (ఎస్సీ) కులస్తులు తమకు కుల ధ్రువీకరణ ఇప్పించాల్సిందిగా అభ్యర్థిస్తూ సబ్ కలెక్టర్‌కు అర్జీనిచ్చారు. 2020లో చేయూత పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం జీవోను ఇచ్చి, సర్టిఫికెట్లను ఇచ్చినట్టు తెలిపారు. ప్రస్తుతం రెన్యువల్ చేసి , ఆధార్ కార్డుకు కుల ధ్రువీకరణ జత చేయించేలా చూడాలని కోరారు. వీటితోపాటు రెవిన్యూ-1 పోలీస్-1, మున్సిపాలిటీ ఒకటి చొప్పున స్పందన సమావేశంలో మొత్తం అయిదు అర్జీలు వచ్చినట్టు సబ్ కలెక్టర్ తెలియజేశారు.

## అక్రమ రుణాలు పొందిన ఆర్‌పీలపై చర్యలు తీసుకోవాలి

- డ్వాక్రా గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలి
- సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మహిళలు, సీపీఎం నాయకులు

రేపల్లె: డ్వాక్రా గ్రూపుల్లోని సభ్యుల ప్రమేయం లేకుండా వారి పేర్లపై రుణాలు పొందిన ఆర్‌పీలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల ఆర్‌పీలు డ్వాక్రా సభ్యులకు తెలియకుండానే బ్యాంకుల నుంచి లక్షలాదిరూపాయల రుణాలు కొల్లగొట్టారన్నారు. గతంలో పలుమార్లు అవకతవకలు జరిగిన ఆర్‌పీలపై చర్యలు తీసుకోవటంలో మున్సిపల్ అధికారులు వైఫల్యం చెందారన్నారు. బ్యాంకర్లతో ఆర్‌పీలు కుమ్మక్కై నకిలీ గ్రూపులు సృష్టించి లక్షలాది రూపాయల రుణాలు పొందుతున్నారని విమర్శించారు. తిరిగి బ్యాంకులకు రుణాలు చెల్లించకపోవటంతో ఆర్‌పీలు బ్యాంకులకు అందజేసిన జాబితాలలోని సభ్యులకు రుణం చెల్లించాలని నోటీసులు పంపుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో 21వ వార్డులో పలువురు సభ్యులకు పలు ప్రైవేటు బ్యాంకుల నుంచి నోటీసులు అందాయని తెలిపారు. తాము ఎటువంటి రుణాలు పొందలేదని న్యాయం చేయాలని మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించకపోవటం శోచనీయమన్నారు. నోటీసులు అందటంతో 21వవార్డుకు చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యురాలు షేక్ గౌసియా భర్త కరిముల్లా నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యయత్నం చేయడం బాధాకరమన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల పేరుతో రూ.కోటికిపైగా బ్యాంకుల నుంచి రుణాలుపొందినట్లు పట్టణంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. రెండు రోజుల్లో మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరించి సభ్యులకు న్యాయం చేయకుంటే నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మెప్మా సీఎంఎం విజయకు వినతిపత్రం అందజేశారు. విజయ మాట్లాడుతూ రుణాల విషయంపై విచారించి, చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో 21వవార్డు డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయ విద్యార్థుల క్రీడా ప్రతిభ



రెండు రాష్ట్రాల రీజియన్ స్థాయిలో తృతీయ స్థానం సాధించిన వాలీబాల్ జట్టు



జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించిన హరిణి

తెనాలి: కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజియన్ స్థాయి ఆటల పోటీల్లో తెనాలి కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు సత్తాచాటారు. హైదరాబాద్‌లోని బొల్లారంలో ఈనెల 16, 17 తేదీల్లో జరిగిన పోటీల్లో వాలీబాల్‌లో తెనాలి విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. కె.క్లెన్సీ కెప్టెన్సీలో బి.అనూష, జి.సాహితి, డి.పూజిత, టి.విన్సీ, టి.భార్గవి, జి.హిమశ్రీవిద్య, కె.హరిహంసిక ఆడారు. అంతకుముందు జరిగిన అథ్లెటిక్స్ మీట్‌లో తెనాలి కేంద్రీయ విద్యాలయ 12వ తరగతి విద్యార్థిని పి.హరిణి జావెలిన్ త్రోలో బంగారు పతకం సాధించింది. ఈ విజయంతో వచ్చే నెలలో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికైంది. ఉత్తమ ప్రదర్శన చేసిన క్రీడాకారుల్ని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్ బి.రవికుమార్, కోచ్ డి.అజయ్ అభినందించారు.

## ఆయుర్వేద వైద్యం ప్రాచీనమైనది



గుంటూరు రూరల్: ఆయుర్వేదం భారతదేశ ప్రాచీన వైద్యమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. సోమవారం నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో ఉన్న ఆయుర్వేద సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌ను కోట్టకల్ ఆర్యవైద్యశాల కేరళ అనుబంధంగా ఉన్న హాస్పిటల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 పడకలతో ఆయుర్వే వైద్యశాలను ఏర్పాటు చేసిన ఆయుర్వేద వైద్య అభివృద్ధికి కృషిచేస్తున్న హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును అభినందించారు. దీర్ఘకాలిక వ్యాధులైన పక్షవాతం, కీళ్ళనొప్పులు, చర్మవ్యాధులు, నరముల వ్యాధులు తదితర వైద్య సేవలు ఆసుపత్రిలో అందిస్తున్నామని వైద్యులు మాజీ ఉప రాష్ట్రపతికి వివరించారు. ఈ కార్యక్రమంలో భాష్యం రామకృష్ణ, చరణ్‌సాయి, కరుణాకర్, డాక్టర్ జె.ధనలక్ష్మి, డాక్టర్ జి.సాయిగౌతమి, డాక్టర్ ఎల్.మౌనిక, డాక్టర్ వి.సుష్మిత, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ పి.భానుకశ్యప్, మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

## ఆర్.ఆర్. నగర్‌లో మురుగు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి అర్బన్: మారీసుపేటలోని డాక్టర్ రావి రవీంద్రనాథ్‌నగర్, చంద్రబాబునాయుడు కాలనీలో మురుగును బయటకు పంపేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. సాక్షి దినపత్రికలో సోమవారం 'మురుగు ముంచెత్తుతోంది' అనే శీర్షికన కథనం వెలువడిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు జెబీసీతో మురుగు పోయేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మురుగును బయటకు పంపి బ్లీచింగ్ చల్లారు.

## ఆరో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న జేఏసీ నేతలు

తెనాలి అర్బన్: ఆర్టీసీ అధికారుల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారంతో ఆరో రోజుకు చేరాయి. దీక్షల్లో కండక్టర్లు ఎం .గురవయ్య, వి.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దీక్షకు సంఘీభావం ప్రకటించిన వారిలో ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.కాంతారావు, గౌరవ అధ్యక్షుడు ఎం.అబ్రహాం, రమేష్, పీడీఎస్ బాబు, ఎస్‌వీపీ బాబు, ఎస్.సుధాకర్, జె.వేణుగోపాల్, బి.పాపారావు, ఎం.మనోజ్, పి.యలమందయ్య ఉన్నారు.

## గుండెపోటుతో కార్మికుడి మృతి

గుంటూరు రూరల్: గుండెపోటుతో కార్మికుడు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం ఇరుకుపాలెం గ్రామానికి చెందిన బత్తుల కోటేశ్వరరావు (50) మిర్చి యార్డులో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం యార్డులో పనికి వచ్చాడు. అనంతరం పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి, అతనిని ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. సమాచారం తెలిసిన నల్లపాడు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, పరిశీలించారు. కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## 'స్పందన' ఫిర్యాదులకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

**అధికారులకు అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశం**



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు

నెహ్రూనగర్: స్పందనలో ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులో పరిష్కారమయ్యేలా విభాగాధిపతులే నేరుగా పరిశీలించి, పరిష్కరించాలని పెద్ది రోజా ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే ఫిర్యాదుల్ని బాధ్యతతో పరిష్కరించాలని, విభాగాల వారీగా అర్జీల పరిష్కారానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని ఆదేశించారు. వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులందరూ అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 25 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 5, ప్రజారోగ్య విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

## 'మణిపూర్‌లో మంటలు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పెనుగొండ లక్ష్మీనారాయణ, సింగారావు తదితరులు

తెనాలి: మణిపూర్‌లో జరిగిన మారణకాండపై ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రచురించిన ద్విభాషా సంకలనం 'మణిపూర్ మంటలు' పుస్తకాన్ని జబల్‌పూర్‌లో సోమవారం జరిగిన 18వ జాతీయ మహాసభల వేదికపై ఆవిష్కరించారు. అరసం ఏలూరు శాఖ ప్రచురించిన ఈ పుస్తకానికి సంపాదకవర్గంలో గుంటూరు జిల్లాకు చెందిన కొమ్మాలపాటి శరచ్చంద్ర జ్యోతిశ్రీ ఉన్నారు. పుస్తకావిష్కరణలో జిల్లాకు చెందిన అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, జి.ఓబులేసు, ఏఎంఆర్ ఆనంద్, తెనాలికి చెందిన అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు పాల్గొన్నారు.